# కలకాని కథ

కాళ్ళు నడుస్తున్నాయి. కళ్ళు చూస్తున్నాయి. చెవులు వింటున్నాయి. కాని మనసు పరధ్యానంగా వుంది. బుర్ర యెక్కడో పనిచేస్తోంది. అయినా రోడ్డుమీద ప్రమాదాలేవీ జరగలేదు. బస్సులు, రిక్షాలు, టాక్సీలు పరిగెడుతూనే వున్నాయి. జనం యెదురుగా వస్తున్నారు. వెనకనించి వస్తున్నారు. సానుభూతి కలవాళ్ళు తప్పించుకు పోతున్నారు. అదిలేని వాళ్ళు తిట్టుకుంటూ పోతున్నారు. వాటన్నిటికి అతీతుడుగా అతను నడుస్తూనే వున్నాడు. ఎక్కడికో... ఎందుకో...

"సుబ్బారావ్!" వెనకనించి పిలుపు. కాళ్ళు ఆగలేదు.

"నిన్నేరోయ్!"— ఊహుఁ ఆగలేదు.

"పిచ్చి - పుల్లయ్యలా పిలిచినా వినిపించుకోవేరా పూల్"— ఈసారి భుజం మీద తట్టి పిలిచాడు.

"ఎవరు? వెంకట్రావా?" వెంకట్రావుకి చంపేద్దామన్నంత కోపం వచ్చింది.

"రోడ్డుమీద ఆలోచన లేమిటిరా అభాగ్యుడా!" ఇదిగో తాళంచెవి. గదికి నడు పసాను." సుబ్బారావుకి స్పృహ వచ్చింది ఇప్పటికి. యేదో అడుగుదాం అనేటప్పటికి వెంకట్రావు అక్కడ లేడు.

తన ఆలోచనలకి తానే నవ్వుకున్నాడు. ద్వారకాలో కాఫీ త్రాగి గది చేరుకున్నాడు. తలుపు తెరిచేటప్పటికి యెదురుగా ఉత్తరం. దస్తూరీ చూస్తే నాన్నదిలా వుంది. ఏం బాధలు మోసుకొచ్చిందో... ఇంకేముంది పెళ్ళిగోల. దాసుదుమావయ్య కూతుర్ని చేసుకోమని అమ్మగోలపెడుతోంది. ఆ పెళ్ళి జరక్కపోతే నుయ్యో గొయ్యో చూసుకుంటుందట. ఇంకేం బాగానే వుంది.

మళ్ళీ సుబ్బారావు బుర్రలో ఆలోచనలు తేళ్ళల్లా మెదిలాయి. తన పెళ్ళికి అమ్మ నిర్బంధం యేమిటి? ఏమిటీ బెదిరింపులు?" కన్న తల్లికి ఆ మాత్రం అధికారం లేదురా పిచ్చి పీనుగ!" గుండె లోతుల్లో సన్నగా గుసగుసలు... అంతా యీ మధ్యనే సుబ్బారావుకి పెళ్ళి చేసుకోవాలనే భావన యేర్పడింది అస్పష్టంగా. యెవర్ని చేసుకోవాలనేది జవాబు రాని ప్రశ్న. తన దృష్టిపథంలో పడ్డ అమ్మాయిలని తలచుకుంటే తనాశించినంత సులువుగా తెగే సమస్యలా తోచలేదు.

మామయ్య కూతురు లలిత పేరెంత లలితమో మనిషంత పెడసరం అందమూ లేదు. అంతర్యమూ లేదు. అయితేనేం కావలసినంత కట్నం. ఒక్కతే కూతుర్నా

రెండో అమ్మాయి వెంకట్రావు చెల్లెలు సరోజ. ఓ సెలవుల్లో వెంకట్రావింటికి వెడితే ఆ అమ్మాయిని చేసుకోమనే భావాలు వెలిబుచ్చారు. భర్తకి పనులు చెయ్యగల బలం. శతకాలతో అంతమైన సాహిత్యం. చాకిరి పద్దులు వేసే తెలివి. మంగళ హారతులు పాడే సంగీతం. ఇవి ఆమె ఆకారానికి మెరుగు పెట్టే ప్రత్యేక లక్షణాలు. కట్నాలు కానుకలు యివ్వలేక పోయినా మర్యాదల కే లోటూ లేదు. అసలు పెళ్ళనేది చేసుకుంటే తప్పకుండా మీ చెల్లెల్నే చేసుకుంటానని వెంకట్రావుతో చెప్పాడు.

మరొకామె వకీలుగారమ్మాయి. అందాని కందం, చదువుకు చదువు అన్నీ వున్నాయి. కాని ఆశించినంత కట్నం లభించదు. కట్నం రాదనుకుంటే హృదయానికి కనీసం కామించే శక్తి కూడా వుండదు....

శ్రీ అరుణాకుమార్

ఇకపోతే ఆ మధ్య పార్కులో కనిపించిన నీలిచీర అమ్మాయి. ఆకర్షణీయమైన ఆకారం. ఆ అమ్మాయిని చూడాలనే కాంక్షతో వారం రోజులు వరుసగా వెళ్ళాడు పార్కుకి. ఆ నీలిచీరలో మూట గట్టిన సౌందర్యం అతన్ని కొంచెం గిలిగింతలు పెట్టినమాట నిజం. ఆ అమ్మాయి యెవరో కాదు. తన గది కెదురు మేడలో కొత్తగా కాపురానికి వచ్చిన ఉద్యోగస్తుని కూతురు. నాటితో అప్పన్నిన్ని పెట్టుకుని పార్కులో పడిగాపులు పడేందుకు బాధపడ్డాడు.

ఆ రాత్రంతా అతని హృదయం వూహించి వూహించి కలలు కని వికలమై పోయింది. ఆ కల్లోలపు ప్రతిధ్వని అతని రక్తనాళాల్లో ఇంకా వినిపిస్తూనే వుంది. ఆ అమ్మాయిని తాను ప్రేమిస్తున్నాడా? ఏమో... తనకే తెలీకుండా హృదయం దగా చేస్తోం దేమో! ఆస్తిపాస్తు లేమాత్రం వున్నాయో? రక్తం సెలయేరులా ప్రవహిస్తోం దెందుకు? గుండె వేగంగా కొట్టుకుంటుం దెందుకు? గత సాయంత్రం ఆ అమ్మాయి కలిపించుకుని తను వినాలని, తనకే వినబడాలని యేమిటో పాడింది. తన వంక అదోలా చూసిం దెందుకు? తనకోసం కాదూ? మరి తను చూస్తే తెచ్చుకున్న కోపం ముఖం అంతా అలుముకుంటుం దెందుకు? తెలిస్తే వాళ్ళ తల్లితండ్రులు ఏమనుకుంటారు? గౌరవంగా బ్రతికే పరిసరాలేమని వూహ స్తాయిలేమో... లాభం లేదు. ఎవరో ముక్కూమొహం తెలీని అమ్మాయి. వంశగోత్ర నామాలు తెలీని అమ్మాయి. పూర్వాపరాలు తెలిసికోకుండా ఆ ప్రేమ కలాపాల్లో పడితే కథ యెలా అంతమవుతుందో మరి. లోకంలో అందమైన అమ్మాయిలకి లోటు లేదు. పెళ్ళి చేసుకునే మగాళ్ళుండాలికాని. అయినా ఆ అమ్మాయి హృదయంలో ఓ మూల మెదులుతూనే వుంది. మళ్ళీ నాన్న ఉత్తరం. ఆగిపోయిన ఆలోచనలు తేనెటీగల్లా రేగాయి. ఈ సమస్యలకి పరిష్కారం యెక్కడ? ఆలోచనలకి అంతం యెక్కడ? తల పగిలి పోతోంది. ఓ మూల పరీక్షలు... ఓ వైపు జీవిత పరీక్షలు... దిండు ముఖాని కదుముకుని గట్టిగా యేడవా లనిపించింది. హావురుమని ఆడదానిలా యేడవలేడుగాని అప్పుడైన మగాడిలా మనస్సులో యేడ్చాడు. యెప్పుడు నిద్ర పట్టిందో తెలీదు. అలాంటి కలలు. అందులో అందమైన అమ్మాయిలు. ఆశాపూరిత నేత్రాలతో చూస్తున్నారు. అనునయ గాత్రాలతో పిలుస్తున్నారు. తను మౌనంగా, దీనంగా, కళ్ళప్పగించి ప్రేక్షకుడిలా చూస్తున్నాడు. అర్థంకాని కోపాలు ప్రదర్శిస్తున్నారు. శాపాలు శపిస్తున్నారు. ఆదిలో ప్రణయ స్వరూపులు... అంత్యంలో ప్రళయ రూపాలు. ఇట్టే మారి పోతున్నాయి. యేదో చెప్పాలనుకుంటాడు తను. నోరు పెగలటం లేదు.... అన్ని రూపాలూ చెరిగి పోయాయి. ఒక్కతే అమ్మాయి. తానామెతో సంసారం వెలిగిస్తున్నాడు. తొలి యౌవన మధుర దినాలు. స్వర్గంలాంటి సంసారం. అర్ధాంగి అనురాగంలో జీవిత పరమార్థం లభించినట్లనిపించింది. సంవత్సరం తిరగకుండా ఇంట్లో పాపాయి నవ్వులు వెన్నెల కురిపిస్తున్నాడు. అచ్చంగా తన రూపే... పోతపోసి నట్లు పుట్టాడు. తను ఇప్పుడు తండ్రి. పున్నామ నరకం తప్పింది. ఆవిడకి రోగం. అబ్బాయికి పాలు చాలవు. పాల డబ్బాలు. ఆవిడ బలానికి మందులు. లేకపోతే మళ్ళీ కనటానికి శక్తి యేదీ! ఆఫీసుకి ఆలస్యంగా వెళ్ళటం తప్పని సరయింది. అధికారి చివాట్లూ తప్పలేదు. అభిమానం దెబ్బతింది. ఉద్యోగానికి రాజీనామా ఇచ్చేవాడే... కాని ఇంట్లో ఖర్చులు... కుటుంబ పరిస్థితులు అలాగే కట్టి పడేసాయి. చాలని జీతం. ఆప్తమైన వాళ్ళ దగ్గిరా అప్పులు.... చిటికిమాటికి ఇంట్లో పోట్లాటలు. బయట పోట్లాటలు. అప్పులాళ్ల అడ్డగింపులు... జీవచ్ఛవంలా తయారయాడు తను. ఇప్పుడేదీ ఆ స్వర్గసౌఖ్యం?... తనతోటి నిత్య



సుబ్బారావుకి స్పృహ వచ్చింది ఇప్పటికి

జీవులంతా అతన్ని చూసి నవ్వుతున్నారు. తన్ను చూసి ఒకళ్ళూ జాలి పడరు. ఒక్కరూ సహాయపడరు. అర్థాంగే అసహ్యించుకుంటోంది... ఇక లోకం చెప్పాలా? ఒకటే విరసం అన్యం ఇదేదో వుంది. పెద్దు... వద్దు... ఇంతకన్నా చటుక్కునే లోపలే వాగుతున్నాయి. ఈ పెళ్ళిచేసుకోడం కన్నా పీక పిసుక్కొని చావటం మంచిది. అలలు విరిగి పోయాయి. కలలు కరిగి పోయాయి. "నేను పెళ్ళి చేసుకోను... నేను పెళ్ళి చేసుకోను...." వెంకట్రావు వచ్చేటప్పటికి సుబ్బారావు కలవరిస్తున్నాడు.

"లోకానికేం లోటు లేదు. ఇక లేవగా బ్రదర్!" వెంకట్రావు లేపాడు. సుబ్బారావు పిచ్చిపిలా చూస్తూ పోతున్నాడు. సింహాసనం మీదనుంచి పడ్డంతగా బాధపడుతున్నాడు. సింహాసనం మీద కూడికొంతగా ఏడుస్తున్నాడు. దిండు నిండా తడిచేసాడు. వెంకట్రావుకి ఏమీ అర్థం కావటం లేదు...

"ఏమిట్రా ఆ మూగ బాధ"— అనునయంగా అడిగాడు....

"ఏమీ లేదు. ఏదో పీడ కల వచ్చింది అంతే" ముక్తసరిగా చెప్పాడు. గడియారం 10 కొట్టింది. వెంకట్రావు ముసుగు బిగించాడు.

తండ్రికి ఉత్తరం రాశాడు.

నాన్నా!

అప్పుడే నా పెళ్ళికేం తొందర చెప్పండి. కొంత కాలం పాటు స్వేచ్ఛగా బ్రతకనివ్వండి. పరీక్ష అయ్యాక నా అభిరుచికి అనుగుణంగా అవ ఉన్నాను.

ఇంకా చాలగా రాయాలనుకున్నాడు. కాని కలం సాగలేదు. తన ఆర్థిక వ్యవస్థ బాగు పడ్డాక తనకు నచ్చిన అమ్మాయిని చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. లక్ష్యా నా తప్పని సరై తనే...

వెంకట్రావూ తనూ నాలుగేళ్ళనుంచి కలిసి చదువుతున్నారు. వెంకట్రావు కిలాంటి సమస్యలు లేవటున్నదే? వా దెప్పుడూ బాధపడినట్లు కనిపించడు. వెంకట్రావు నష్టం చేసుకోవాలని యెంతో ప్రయత్నించాడు తను. వాడో అర్థంకాని సమస్యలా మిగిలి పోయాడు. నిశ్చింతగా నిద్ర పోతున్నాడు. తనకన్నా వాడే నయం. సిరిచీర అమ్మాయి కామోసు పాడుతోంది. బలవంతంగా పుస్తకం తెరిచాడు. అక్షరాలన్నీ అమ్మాయిల్లా కనిపిస్తున్నాయి. మళ్ళీ ఆలోచనలు రేగేటట్టున్నాయి. పుస్తకం మూసి బలవంతంగా కళ్ళు మూసుకున్నాడు....

ఆ సంవత్సరంతో ఇద్దరిచదువులూ పూర్తయ్యాయి. ఇద్దరూ విడి పోయారు. నాలుగేళ్ళు కలిసిమెలిసిన స్నేహం కొన్నాళ్ళపాటు ఇద్దరినీ యేడిపించింది.

*

కాల ప్రవాహంలో మూడేళ్ళు కొట్టుకుపోయాయి, అనుకోకుండా సుబ్బారావు వెంకట్రావు బెజవాడ రైలు స్టేషనులో కలుసుకున్నారు. ఇద్దరి హృదయాలూ ఉప్పొంగాయి.

సుబ్బారావు కంపార్టుమెంటు ప్రక్కనే నిలబడ్డాడు. రెండేళ్ళ కుర్రాడు ఒకడు సిరి చీర అమ్మాయి ఒడిలోంచి సుబ్బారావు మీదికి నవ్వుతూ వంగుతున్నాడు. వెంకట్రావు విషయం ఇట్టే పసిగట్టాడు.

"బ్రహ్మచర్యం విడిచి పెట్టినా సిరిచీర అమ్మాయినే కట్టుకున్నావన్నమాట" వెంకట్రావు నవ్వుతూ అడిగాడు.

"మామయ్య కూతురు లలిత. అమ్మకోసం అయినా తప్పింది కాదు." పాపాయి నెత్తుకుంటూ బాధగా నవ్వాడు సుబ్బారావు.

"ఏవో ఆదర్శాలు పెట్టుకుని ఆచరించలేక బాధ పడటంకన్నా అదే మంచిది. ఎవరైతేనేమిటి హృదయానికి సరిపెట్టుకునే శక్తి వున్నప్పుడు", పాపాయి బుగ్గ మీద చిటికేశాడు వెంకట్రావు. రైలు కూత పెట్టి బయలుదేరింది. వెంకట్రావు ఏదో ఆలోచిస్తూ జేబు గుడ్డ గాలిలో విసిరాడు.